



RNI Reg NO: APTEL/2024/ 86898

# బహుజన వేదిక

తెలుగు జాతీయ దినపత్రిక




ANANTHAPURAM I KURNOOL I KADAPA I AMARAVATHI HYDERABAD I VIJAYAWADA I VISHAKAPATNAM I GUNTUR I PRAKASAM I RAJAMANDRI I TADEPALLIGUDEM I KHAMMAM I KARIMNAGAR I I NALGONDA I

సంపుటి : 2 సంచిక : 9 | శుక్రవారం 22 ఆగస్టు 2025 | ఎడిటర్ : పి రామాంజనేయ ప్రసాద్ | వెల : 5/- | పేజీలు : 8 | Email : bahujanavedikaap@gmail.com

### గ్రామ సచివాలయాల్లో అవుట్ సోర్సింగ్ ద్వారా

# పోస్టుల భర్తీ

- విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు అదనంగా వంద ఎకరాలు
- అమరావతి నిర్మాణ పనులకు రూ.904.00 కోట్లకు ఆమోదం
- మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలకు ఆమోదం



**అమరావతి బహుజన వేదిక**

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 2,778 పోస్టులను డిప్యుటేషన్, అవుట్ సోర్సింగ్ విధానంతో భర్తీ చేసేందుకు మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గురువారం సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయేతర భూమి (వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్పు) చట్టం, 2006 (%చీ%అఔఅ చట్టం) రద్దు చేసే నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు చట్టం, 2016, ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2014, ఆంధ్రప్రదేశ్ టౌన్ ప్లానింగ్ చట్టం, 1920 %–% ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీలు చట్టం, 1965లకు కొన్ని సవరణలు చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ ఆమోదం వలన - మిగతా3లో



## యూత్ కాంగ్రెస్ లీడర్లు మంచి టాలెంటెడ్ ఉన్నారు.. కానీ

- రాహుల్ గాంధీ అభద్రతా భావంతో ఉన్నట్లు ఉన్నారు.
- ఇది కుటుంబ అభద్రతాభావం అయి ఉండొచ్చు
- యూత్ కాంగ్రెస్ లీడర్లు మంచి టాలెంటెడ్ ఉన్నారు. కానీ వారికి మాట్లాడే అవకాశం రావడం లేదు
- ప్రధాని నరేంద్ర మోదీ




## భవిష్యత్ ఇంధనం హైడ్రోజన్

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ
- రాబోయే కాలంలో పెట్రోల్, డీజిల్ వంటి సాంప్రదాయ ఇంధనాలను హైడ్రోజన్ భర్తీ
- రాబోయే కాలంలో రవాణా, పరిశ్రమ మొత్తం ఎలక్ట్రిక్ వాహనాలు, బయో ఇంధనం, హైడ్రోజన్‌పై ఆధారపడి ఉంటుంది
- శిలాజ ఇంధనాలపై ఆధారపడడం ఇక అంతమవుతుంది



## అవినీతి చేయడంలో..మంత్రులకు చంద్రబాబే 'ఇన్స్పిరేషన్'

- వ్యవసాయ యంత్ర పరికరాల తయారీదారులతో మధ్యవర్తిత్వం నెరిపి తనకు మేలు జరిగేలా చేయాలని
- మంత్రుల అవినీతిని తట్టుకోలేక పారిపోతున్న అధికారులను వెంటాడి మరీ వేధిస్తున్నారు
- నిజాయితీగా పనిచేసే ఉద్యోగులకు ఈ ప్రభుత్వం ఇస్తున్న ప్రయారిటీ ఏంటో అర్థమైపోతుంది
- మాజీ మంత్రి, శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

**శ్రీకాకుళం బహుజన వేదిక**

రాష్ట్రంలో సీఎం చంద్రబాబుతో అవినీతిలో ఆయన కేబినెట్‌లోని మంత్రులు కూడా పోటీ పడుతున్నారని మాజీ మంత్రి, శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. శ్రీకాకుళంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... మంత్రుల అవినీతిని తట్టుకోలేక పారిపోతున్న అధికారులను వెంటాడి మరీ వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. - మిగతా3లో



## సింహం ఎప్పటికీ సింహమే

- పవర్‌ఫుల్ డైలాగ్‌తో.. పొత్తుపై విజయ్ క్లారిటీ
- వచ్చే ఏడాది జరగబోయే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు ఉండబోదు
- ఏ కూటమికి, పార్టీకి బానిసగా ఉండాల్సిన అవసరం నాకు లేదు
- మాది స్వార్థపూరిత కూటమి కాదు.. ఆత్మగౌరవ కూటమి
- బీజేపీతో చేతులు కలిపే ప్రసక్తే లేదు.. మనుగడ కోసమే ఇతర పార్టీలు పొత్తు


# జగన్ మద్దతు బీజేపీకే!




- బీజేపీ కేంద్ర నాయకత్వానికి కూడా జగన్ పట్ల సానుకూల వైఖరి ఉందంటారు
- మరొకవైపు కాంగ్రెస్ కు శత్రువు కావడంతో సహజంగానే తనకు మిత్రుడిగా జగన్‌ను బీజేపీ భావిస్తుంది
- అలాగే రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ మద్దతు ఇస్తూ వస్తుంది.
- తాజాగా మరోసారి ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరగనున్నాయి
- ఇండి కూటమి ఇంకా తన అభ్యర్థిని ప్రకటించలేదు

**గుంటూరు బహుజన వేదిక**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ బీజేపీతో ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకోక పోయినా పరోక్షంగా తన సంబంధాలను కొనసాగిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెడుతున్న ప్రతి బిల్లుకు వైసీపీ ఆమోదిస్తుంది. అలాగే రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ మద్దతు ఇస్తూ వస్తుంది. అధికారంలో లేనప్పుడు, ఉన్నప్పుడు కూడా జగన్ బీజేపీతో సఖ్యతగానే ఉంటూ వస్తున్నారు. బీజేపీ కేంద్ర నాయకత్వానికి కూడా జగన్ పట్ల సానుకూల వైఖరి ఉందంటారు. మరొకవైపు కాంగ్రెస్ కు శత్రువు కావడంతో సహజంగానే తనకు మిత్రుడిగా జగన్ ను బీజేపీ భావిస్తుంది. అందుకే జగన్‌పై నమోదయిన అనేక కేసులు నేటికీ ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయని తెలుగుదేశం - మిగతా3లో



## మన రాకెట్‌లో.. మన వ్యోమగామి..

- త్వరలో అంతరిక్షంలోకి వెళ్తాడు
- ఆస్ట్రోనాట్ శుభాంశు శుక్లా
- అంతరిక్ష కేంద్ర అనుభవం వెలకట్టలేనిది
- క్రూ డ్రాగన్ క్యాప్సూల్‌లో వ్యోమగాములు ఉన్నట్లు వెల్లడి
- అంతరిక్షానికి మనుషులను తీసుకెళ్లే నౌకల్లో ఇదొకటి

### 65 లక్షల మంది మహిళల

## ఉచిత ప్రయాణం

- లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులిచ్చేందుకు యోచిస్తున్నాం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- స్త్రీశక్తి పథకం సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి బహుజన వేదిక**

స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించిన ఆరు రోజుల్లోనే రాష్ట్రంలో 65 లక్షల మందికిపైగా మహిళలు ఉచిత బస్సు సేవలను సద్వినియోగం చేసుకున్నారని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు యోచిస్తున్నామని పేర్కొన్నారు. సూపర్–6లో - మిగతా3లో



## బీఆర్ నాయుడు మూల్యం చెల్లించుకోక తప్పదు



- టీటీడీలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన వ్యక్తి భూమన కరుణాకర్‌రెడ్డి
- అలాంటి వ్యక్తి గురించి మాట్లాడే హక్కు బీఆర్ నాయుడికి ఏమాత్రం లేదు
- జుట్టు తెప్పిస్తామని, మోకాళ్ల నొప్పులు తగ్గిస్తామని మోసం చేశారు
- బీఆర్ నాయుడు చీటర్. బ్రోకర్ రాజకీయాలు చేసే వ్యక్తి
- మాజీ మంత్రి అంబటి రాంబాబు

# సింహం ఎప్పటికీ సింహమే.



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోటీలో పొత్తు అంశంపై తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ మరోసారి క్లారిటీ ఇచ్చారు. వచ్చే ఏడాది జరగబోయే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు ఉండబోదని.. టీవీకే సింగిల్‌గానే బరిలోకి దిగుతుందని స్పష్టం చేశారాయన. గురువారం సాయంత్రం మధురై పరపతిలో జరిగిన మానాడు వేదికగా.. నాలుగు లక్షల మంది అభిమానులు,పార్టీ కార్యకర్తల కోలాహలం నడుమ విజయ్ ప్రసంగించారు. టీవీకే భావజాల శత్రువు బీజేపీ రాజకీయ విరోధి డీఎంకే ఇందులో.. ఏ కూటమికి, పార్టీకి బానిసగా ఉండాల్సిన అవసరం నాకు లేదు. మాది స్వార్థపూరిత కూటమి కాదు. ఆత్మగౌరవ కూటమి. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు, తమ పార్టీ కి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. బీజేపీతో చేతులు కలిపే ప్రసక్తే లేదు. మనుగడ కోసమే ఇతర పార్టీలు పొత్తు పెట్టుకుంటున్నాయి. ఆరెస్సెస్ ముందు మనం ఎందుకు తలవంచాలి?. తమిళ అస్తిత్వాన్ని ప్రతిపక్షాలు తగ్గిస్తున్నాయి. కులం కాదు.. మతం కాదు.. తమిళుడికే టీవీకే తరపున ప్రాధాన్యం ఇస్తాం. కచ్చతీవులకు శ్రీలంక నుంచి స్వేచ్ఛ కల్పిస్తాం. తమిళ జాలర్లకు అప్పగిస్తాం. నీట్ రద్దు కోసం పోరాటం చేస్తాం. రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ ఢిల్లీలో రహస్య సమావేశాలు జరుపుతున్నారు. ఆయన పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. టీవీకే తరపున రాష్ట్రంలో ప్రతి ఇంటి తలుపును తడతామన్నారు. తనను ఎంత విమర్శిస్తే అంత ఎదుగుతానని వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విప్లవం సృష్టిస్తామన్నారు. ఈ క్రమంలో.. తాను మధురై ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. అడవిలో సింహం అనేది ప్రత్యేకమైంది. అది గర్జిస్తే.. ఎనిమిది కిలోమీటర్ల దాకా వినిపిస్తుంది. అలాంటి సింహమే వేటాడేది. అడవిలో గుంటనక్కలెన్నో ఉంటాయి. కానీ, సింహం ఒక్కటే ఉంటుంది. అదే అడవికి రారాజు. సింహం ఎప్పటికీ సింహమే. ఇదే మన డిక్లరేషన్ అని సింగిల్ పోటీని మరోసారి విజయ్ ధృవీకరించారు. నా ప్రజా జీవితంలోకి వచ్చిన తర్వాత చాలా విమర్శలు వచ్చాయి. కానీ నేనేంటో మీకు బాగా తెలుసు. నేను వాటిని సీరియస్‌గా తీసుకోను. నేను తమిళనాడు ప్రజల మాట మాత్రమే వింటాను. చిన్న నవ్వుతో విమర్శలను పక్కన పెడతాను. మా స్వరం ఆపలేని స్వరం.. మా శక్తి ఆపలేని శక్తి. రాజకీయాల్లోకి రాక ముందు.. నేను రాజకీయాలకు రాలేనన్నారు. పార్టీ స్థాపించినప్పుడు, అది సరిపోదు, ప్రజలు ఓటు వేయరని అన్నారని విజయ్ గుర్తు చేసుకున్నారు. మదురైకి వచ్చినప్పుడు నాకు అలంగానల్లూరు జల్లికట్టు, మదురై మీనాక్షి అమ్మన్ గుర్తుకొస్తారు. ఈ గడ్డకు చెందిన కెప్టెన్ విజయకాంత్‌తో అనేక అనుభవాలు నాకున్నాయి. 1967, 1977 ఎన్నికల ఫలితాలు 2026లో పునరావృతం అవుతాయి. టీవీకే ఆ చరిత్రను తిరిగి రాస్తుంది అని విజయ్ ధీమా వ్యక్తం చేశారు.

# మన రాకెట్‌లో.. మన వ్యోమగామి



**న్యూఢిల్లీ:** ఆస్ట్రోనాట్ శుభాంశు శుక్లా ఇండియాలో టూర్ చేస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌కు వెళ్లిన వచ్చిన ఆయన.. ఇవాళ ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో మనదేశ వ్యోమనౌకలో, మన దేశ రాకెట్ ద్వారా.. మన దేశ వ్యోమగామి.. అంతరిక్షంలోకి వెళ్లనున్నట్లు శుక్లా ఆశాభావం వ్యక్తం చేశారు. అంతరిక్ష కేంద్ర అనుభవం వెలకట్టలేనిదని, అక్కడ ఎంతో నేర్చుకున్నట్లు ఆయన చెప్పారు. అంతరిక్షం నుంచి భారత్ అద్భుతంగా కనిపిస్తున్నదన్నారు. 1984లో ఆస్ట్రోనాట్ రాకేశ్ శర్మ చెప్పినట్లు సారే జహాసే అచ్చా అన్న రీతిలోనే ఇండియా ఇప్పటికీ ఉన్నట్లు శుక్లా తెలిపారు.

ఆక్సియం-4 మిషన్‌కు చెందిన ఫాల్కన్9 రాకెట్‌లో ప్రయాణించినట్లు శుభాంశు శుక్లా చెప్పారు. క్రూ డ్రాగన్ క్యాప్సూల్‌లో వ్యోమగాములు ఉన్నట్లు వెల్లడించారు. అంతరిక్షానికి మనుషులను తీసుకెళ్లే నౌకల్లో ఇదొకటి అని తెలిపారు. ఈ మిషన్‌లో తాను మిషన్ పైలట్‌గా చేసినట్లు చెప్పారు. క్రూ డ్రాగన్ క్యాప్సూల్‌లో మొత్తం నాలుగు సీట్లు ఉంటాయన్నారు. మిషన్‌కు పైలట్ కావడం వల్ల.. కమాండర్‌తో పని చేయాల్సి ఉంటుందని, ఆ తర్వాత క్రూ డ్రాగన్ సిస్టమ్స్‌తో ఇంటరాక్ట్ కావాల్సి ఉంటుందన్నారు. భారతీయ పరిశోధకులు అభివృద్ధి చేసిన ప్రయోగాలను అక్కడ పర్ఫార్మ్ చేయాల్సి వచ్చిందన్నారు. స్టెమ్ డెమోలు, ఫోటోలు తీయడం, వీడియోలు తీయడం కూడా చేసినట్లు తెలిపారు. శిక్షణ పొందిన దాని కన్నా ఎక్కువగా మానవ అంతరిక్ష మిషన్‌ను హ్యాండిల్ చేయాల్సి వస్తుందన్నారు. ఆ మిషన్‌లో భాగం కావడం వల్ల వచ్చే జ్ఞానం వెలకట్టలేనిదన్నారు. గత కొంత కాలం సేకరిస్తున్న సమాచారం .. మన దేశం చేపట్టే అంతరిక్ష ప్రయోగాలకు ఉపయుక్తంగా ఉంటుందని శుక్లా పేర్కొన్నారు. గగన్‌యాన్‌తో పాటు భారతీయ అంతరిక్ష కేంద్రం ప్రాజెక్టులో తన అభవనం కీలకం కానున్నట్లు చెప్పారు.తొందరలోనే మన క్యాప్సూల్ నుంచి మన రాకెట్ ద్వారా మన దేశ వ్యోమగామి అంతరిక్షం వెళ్తారన్నారు. గ్రౌండ్‌లో పనిచేసిన అనుభం చాలా భిన్నంగా ఉంటుందన్నారు. అంతరిక్ష ప్రయాణ సమయంలో మానవ శరీరం చాలా మార్పులకు లోనవుతుందన్నారు. 20 రోజుల పాటు అంతరిక్షంలో ఉంటే, అప్పుడు శరీరాన్ని ఎలా గురుత్వాకర్షణలో ఉంచాలన్న విషయాన్ని మరిచిపోతుందన్నారు.

# కొంప ముంచింది ఆ ఇద్దరే..
# 30 రోజులు జైల్లో ఉంటే నేతల పదవి ఊస్టింగ్..



**న్యూఢిల్లీ:** తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటూ ఏకధాటిగా 30 రోజులుగా కస్టడీలో గడుపుతున్న ప్రధానమంత్రి, ముఖ్య మంత్రి, కేంద్ర రాష్ట్రమంత్రులను పదవి నుంచి తొలగించేలా కేంద్రం మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కేంద్రం ఈ వివాదాస్పద బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు ఇద్దరు నేతలు కారణమని తెలుస్తోంది. ఇంతకీ ఎవరా ఇద్దరు? వాళ్లు ఏం నేరం చేశారు. గతేడాది ఢిల్లీ సీఎంగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్ మద్యం పాలసీ కేసులో జైలు శిక్షను అనుభవించారు. జైలు నుంచి పరిపాలన కొనసాగించారు. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓటమి సంగతి అటుంచితే.. లిక్కర్ కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ రాజీనామా చేయకపోవడంతో,తీవ్రమైన నేరాలకు పాల్పడి నెలకు పైగా జైలు శిక్ష అనుభవిస్తున్న ప్రజాప్రతినిధుల్ని పదవుల్ని తొలగించేలా కేంద్రం చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని ప్రభుత్వ ఉన్నత వర్గాలు తెలిపాయి. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ గతేడాది జూన్‌లో అరెస్టయ్యారు.జూన్ నుంచి సెప్టెంబర్ వరకు జైలు శిక్షను అనుభవించారు. జైలు శిక్షను అనుభవించే సమయం లో సీఎం పదవికి రాజీనామా చేయలేదు.ఆ సమయంలో ఈ చట్టాన్ని అమలు చేయాలని కేంద్రం భావించింది. కానీ ఆ సమయంలో చట్టాన్ని ప్రవేశపెడితే ప్రతిపక్షాలపై కేంద్రం ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని అపవాదు వస్తుందనే ఉద్దేశ్యంతో వేచి చూసి ధోరణిని అవలంభించింది. కొంత కాలం తర్వాత జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓడిపోవడంతో వివాదాస్పద చట్టం మరుగున పడింది. మళ్లీ ఇన్నాళ్లకు అదే చట్టాన్ని అమలు చేసేలా లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టింది కేంద్రం కేంద్రం ఈ చట్టాన్ని అమలు చేసేందుకు ప్రేరేపించిన మరో కేసు తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ కేసు. డీఎంకే పార్టీలో నాలుగు సార్లు సెంథిల్ బాలాజీ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తమిళనాడు మాజీ రవాణాశాఖ మంత్రి, ఉద్యోగాల పేరుతో లంచాలు తీసుకున్నారన్న ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసింది. 2023లో ఆయనను అరెస్ట్ చేసింది. దాదాపు 14 నెలలు జైల్లో ఉన్న తర్వాత 2024 సెప్టెంబర్ 26న బెయిల్ మంజూరైంది. సెంథిల్ బాలాజీ అరెస్టయి జైలు శిక్షను అనుభవిస్తున్న సమయంలో ఎలాంటి శాఖ లేకపోయినా మంత్రిగా కొనసాగారు. ఇదే విషయంలో మద్రాస్ హైకోర్టు బాలాజీపై తీవ్ర విమర్శలు చేసింది. శాఖ లేకుండా మంత్రిగా కొనసాగడం అంటే రాజ్యాంగాన్ని అపహాస్యం చేసినట్లే అవుతుందని వ్యాఖ్యానించింది. ఆ తర్వాత న్యాయపరమైన చిక్కులు ఉత్పన్నం కావడంతో తన పదవికి రాజీనామా చేశారు. బెయిల్ తర్వాత అన్నాడీఎంకేలో చేరి సెంథిల్ బాలాజీ మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంపై సుప్రీం కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. బెయిల్ ఇచ్చిన మరుసటి రోజు మీరు మంత్రిగా ప్రమాణం చేశారు. ఇప్పుడు సీనియర్ కేబినెట్ మంత్రిగా ఉన్నారు. సాక్షులు ప్రభావితం అవుతారనే అభిప్రాయం రావచ్చు'అని కోర్టు వ్యాఖ్యానించింది. ఇలా తప్పులు చేసి 30రోజుల పాటు జైలు శిక్షను అనుభవించిన నేతల పదవులు కోల్పోయేలా బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం కసరత్తు చేసినట్లు సమాచారం.

# లోక్‌సభ నిరవధిక వాయిదా.. ప్రతిపక్ష నేతలపై స్పీకర్ ఫైర్




**ఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా లోక్‌సభ నిరవధిక వాయిదా పడింది. సమావేశాల్లో భాగంగా 21 రోజుల పాటు జరిగిన లోక్‌సభ నేడు నిరవధికంగా వాయిదా పడింది. ఈ సందర్భంగా విపక్షాల తీరుపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఎక్కువ శాతం నిరసనలతోనే సభ గడిచింది. బీహార్‌లో చేపట్టిన ఓట్ల సవరణ ప్రక్రియపై చర్చ చేపట్టాలని విపక్షాలు ముందు నుంచి డిమాండ్ చేస్తున్నాయి. కానీ, ఆ అంశంపై ఇచ్చిన వాయిదా తీర్మానాలను ప్రభుత్వం మాత్రం పక్కన పెట్టేసింది. జాబితా నుంచి 65 లక్షల ఓటర్ల తొలగింపుపై చర్చ చేపట్టాలని వర్షాకాల సమావేశాలు ప్రారంభం నుంచి విపక్షాలు డిమాండ్ చేశాయి. నేడు లోక్‌సభకు ప్రధాని మోదీ వచ్చారు. కానీ విపక్షాలు మాత్రం తమ పట్టువీడలేదు. విపక్షాల తీరుతో విసుగెత్తిన స్పీకర్ ఓం బిర్లా .. సభను నిరవధికంగా వాయిదా వేశారు. విపక్షాల వల్లే ఈసారి సభ సరిగా జరగలేదని ఆయన అన్నారు. ఇక రాజ్యసభ ఇవాళ మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా పడింది. ఈ సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెట్టిన 14 బిల్లుల్లో 12 బిల్లులకు లోకసభ ఆమోదం తెలిపింది. ఆపరేషన్ సిందూర్‌పై అత్యధికంగా 37 గంటలపాటు జూలై 28, 29 తేదీల్లో ప్రత్యేక చర్చ నడిచింది. ఆగస్టు 18న భారత అంతరిక్ష కార్యక్రమ విజయాలపై కూడా ప్రత్యేక చర్చ మొదలైనా ప్రతిపక్ష ఎంపీల నిరసనల కారణంగా చర్చ పూర్తికాలేదు. ఈ సమావేశాల్లో చర్చించాల్సిన జాబితాలో 419 ప్రశ్నలు ఉన్నా, కేవలం 55 ప్రశ్నలపై మాత్రమే చర్చ జరిగింది.

## యూత్ కాంగ్రెస్ లీడర్లు మంచి టాలెంటెడ్ ఉన్నారు.. కానీ



న్యూఢిల్లీ: కొంతకాలంగా ఓట్ చోరీ అంశంపై అటు ఈసీనీ, ఇటు కేంద్రాన్ని విమర్శిస్తున్న ఏఐసీసీ నేత రాహుల్ గాంధీలో అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ చురకలంటించినట్లు తెలుస్తోంది. గురువారం పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా టీ బ్రేక్‌లో ఎన్డీఏ నేతలతో మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్‌లో యువత టాలెంట్‌కు కొదవలేదు. చాలామంది యువ కాంగ్రెస్ నాయకుల్లో మంచి టాలెంట్ ఉంది. యూత్ కాంగ్రెస్ లీడర్లు మంచి టాలెంటెడ్ ఉన్నారు. కానీ వారికి మాట్లాడే అవకాశం రావడం లేదు. దాన్ని రాహుల్ గాంధీనే కల్పించడం లేదు. రాహుల్ గాంధీ అభద్రతా భావంతో ఉన్నట్లు ఉన్నారు. ఇది " కుటుంబ అభద్రతాభావం" అయి ఉండొచ్చు' అని ఎన్డీఏ నేతలతో మోదీ వ్యాఖ్యానించినట్లు సమాచారం. కాగా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా లోక్‌సభ నిరవధిక వాయిదా పడింది. సమావేశాల్లో భాగంగా 21 రోజుల పాటు జరిగిన లోక్‌సభ నేడు నిరవధికంగా వాయిదా పడింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఎక్కువ శాతం నిరసనలతోనే సభ గడిచింది. బీహార్‌లో చేపట్టిన ఓట్ల సవరణ ప్రక్రియపై చర్చ చేపట్టాలని విపక్షాలు ముందు నుంచి డిమాండ్ చేస్తున్నాయి. కానీ, ఆ అంశంపై ఇచ్చిన వాయిదా తీర్మానాలను ప్రభుత్వం మాత్రం పక్కన పెట్టేసింది. జాబితా నుంచి 65 లక్షల ఓటర్ల తొలగింపుపై చర్చ చేపట్టాలని వర్షాకాల సమావేశాలు ప్రారంభం నుంచి విపక్షాలు డిమాండ్ చేశాయి. నేడు లోక్‌సభకు ప్రధాని మోదీ వచ్చారు. కానీ విపక్షాలు మాత్రం తమ పట్టువీడలేదు. విపక్షాల తీరుతో విసుగెత్తిన స్పీకర్ ఓం బిర్లా .. సభను నిరవధికంగా వాయిదా వేశారు.

## భవిష్యత్ ఇంధనం హైడ్రోజన్



భవిష్యత్ ఇంధనం హైడ్రోజన్ అని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. రాబోయే కాలంలో పెట్రోల్, డీజిల్ వంటి సాంప్రదాయ ఇంధనాలను హైడ్రోజన్ భర్తీ చేస్తుందని తెలిపారు. రాబోయే కాలంలో రవాణా, పరిశ్రమ మొత్తం ఎలక్ట్రిక్ వాహనాలు, బయో ఇంధనం, హైడ్రోజన్‌పై ఆధారపడి ఉంటుందని గడ్కరీ వివరించారు. హైడ్రోజన్ రోడ్డు రవాణాకు మాత్రమే పరిమితం కాకుండా రైల్వే, విమానయాన రంగంలో ఉపయోగించనున్నట్లు చెప్పారు. రైళ్లు హైడ్రోజన్‌తో నడుస్తాయని.. విమానాలు హైడ్రోజన్‌తోనే ఎగురుతాయన్నారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడడం ఇక అంతమవుతుందన్నారు. భారతదేశం ఇటీవల జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆటోమేకర్‌గా అవతరించింది. అమెరికా ఆటో పరిశ్రమ విలువ దాదాపు రూ.78 లక్షల కోట్లు, చైనా విలువ రూ.49 లక్షల కోట్లు. భారతదేశం విలువ రూ.22 లక్షల కోట్లు అని గడ్కరీ చెప్పారు. కొద్దిరోజుల కిందట మెర్సిడెస్ గ్లోబల్ చైర్మన్ కంపెనీ భారతదేశంలో ఎలక్ట్రిక్ మెర్సిడెస్ కార్లను తయారు చేస్తుందని తనతో చెప్పారని ఆయన అన్నారు. విద్యుత్, బయో ఇంధనం, హైడ్రోజన్ టెక్నాలజీని పెద్ద ఎత్తున అవలంబిస్తే, భారతదేశం కార్బన్ న్యూట్రాలిటీ వైపు వేగంగా అడుగులు వేయడమే కాకుండా ఉద్యోగాలను సృష్టించడం, పర్యావరణాన్ని కాపాడడం, అభివృద్ధిని వేగవంతం చేస్తుందని గడ్కరీ చెప్పారు. నేడు హైడ్రోజన్ ధర కిలోకు 5-6 డాలర్లు ఉందని గడ్కరీ చెప్పారు. కానీ, దాన్ని కిలోకు డాలర్‌కు తగ్గిస్తే భారతదేశం చమురు ఉత్పత్తి చేసే దేశాల హెూదాను కూడా సాధించగలదన్నారు. దాంతో భారతదేశాన్ని ఇంధన దిగుమతి చేసుకునే దేశం నుంచి ఇంధన ఎగుమతి చేసే దేశంగా మార్చవచ్చన్నారు. హైడ్రోజన్‌ను స్వీకరించడంలో అతిపెద్ద సమస్య ఫిల్లింగ్ స్టేషన్లు, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయడమేనన్నారు. ఈ రంగాల్లో వెంటనే, పెద్ద ఎత్తున పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

## భర్తపై ఆధారపడనని భార్య చెప్పొద్దు : సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** పెళ్లి అంటే ఒక్కటిగా కలిసి జీవించడం అని, ఒకరిమీద ఒకరు ఆధారపడకుండా.. వ్యక్తిగతంగా జీవించడం కాదు అని సుప్రీంకోర్టు పేర్కొన్నది. వేర్వేరుగా జీవిస్తున్న భార్యాభర్తల కేసులో ఇవాళ సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పెళ్లి చేసుకున్న జంట.. భాగస్వామి మీద ఆధారపడకుండా, వ్యక్తిగతంగా ఉంటానని చెప్పడం సరికాదు అని కోర్టు తెలిపింది. ఒకవేళ ఎవరైనా వ్యక్తిగతంగా జీవించాలనుకుంటే, అప్పుడు వాళ్లు వైవాహిక బంధంలోకి వెళ్లకూడదని సుప్రీం ధర్మాసనం తెలిపింది. జస్టిస్ బీవీ నాగరత్న, ఆర్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. వివాహ బంధం కొనసాగుతున్న సమయంలోనే.. వ్యక్తిగతంగా జీవిస్తామని.. భార్య కానీ, భర్త కానీ చెప్పడం కుదరదు అని కోర్టు చెప్పింది. ఈ విషయంలో కోర్టు చాలా స్పష్టంగా ఉందని, పెళ్లి అంటే కలిసి జీవించడం అని ధర్మాసనం అభిప్రాయపడింది. పెళ్లి అంటే ఇద్దరు వ్యక్తులు, రెండు ఆత్మలు ఏకం కావడం అని, మీరెలా వ్యక్తిగతంగా ఉండగలరని కోర్టు ప్రశ్నించింది. పెళ్లి చేసుకున్న జంట.. వ్యక్తిగతంగా జీవిస్తానని చెప్పడం అసాధ్యమని కోర్టు పేర్కొన్నది. ఒకవేళ ఆ జంట ఒక్కటైతే, మేం సంతోషంగా ఉంటామని, ఎందుకంటే వాళ్ల పిల్లలు ఇంకా చిన్నవయసులోనే ఉన్నారని కోర్టు చెప్పింది. గూడు చెదిరిన ఇంట్లో ఎలా ఆ పిల్లలు ఉంటారని, దీంట్లో వాళ్ల తప్పు ఏంటని కోర్టు ప్రశ్నించింది. ఇద్దరూ తమ మధ్య ఉన్న విబేధాలను పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది. ప్రతి భార్యాభర్తల మధ్య ఏదో ఒక రకమైన వివాదం ఉంటుందని కోర్టు అభిప్రాయపడింది. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ దాఖలు చేసిన పిటీషన్‌పై ఇవాళ సుప్రీంలో విచారణ జరిగింది. భర్త సింగపూర్‌లో ఉంటున్నాడు. ఆ జంటకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సింగపూర్ వెళ్లేందుకు భార్య ఇష్టపడం లేదు. సింగపూర్‌లో తన భర్త ప్రవర్తన సరిగా లేదని ఆమె కోర్టుకు చెప్పింది. ఆ సమయంలో కోర్టు ఆమెను కొన్ని ప్రశ్నలు వేసింది. పిల్లల పేరిట కొంత అమౌంట్ డిపాజిట్ చేయాలని భర్తకు కోర్టు సూచన చేయగా, అయితే తాను ఎవరిపై ఆధారపడడానికి ఇష్టంగా లేనట్లు భార్య చెప్పింది. ఆ సమయంలో జస్టిస్ నాగరత్న స్పందిస్తూ మీరలా మాట్లాడకూడదని, ఒకసారి పెళ్లి అయితే, మీరు భావోద్వేగంగా, మరే రీతిలో అయినా భర్తపై ఆధారపడుతారని, ఆర్థికంగా కాకపోవచ్చు అని అన్నారు. నేను ఎవరి మీద ఆధారపడను అని చెప్పవద్దు అని, అలాంటప్పుడు ఎందుకు పెళ్లి చేసుకున్నారని జస్టిస్ నాగరత్న అడిగారు. నేను పాత కాలం మనిషినే కావొచ్చు, కానీ భర్తపై ఆధారపడను అని ఏ భార్య కూడా చెప్పవద్దు అని అన్నారు. మీరంతా చదువుకున్నవాళ్లు, సమస్యను మీరే పరిష్కరించుకోవాలని జస్టిస్ తెలిపారు.

# మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రయాణం





**గొరిదిండ్ల నుంచి ఆత్మకూరు వరకు బస్సులో వెళ్లిన సునీత**
**స్త్రీ శక్తి పథకంపై మహిళలు చాలా సంతోషంగా ఉన్నారు**
**వైసీపీ నాయకులు జనంలోకి వస్తే చెంప చెల్లుమనిపిస్తారు**
**పని లేకనే వారు దుష్ప్రచారానికి దిగారన్న ఎమ్మెల్యే సునీత**

**ఆత్మకూరు ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై దుష్ప్రచారం చేసేందుకు జనంలోకి వస్తున్న వైసీపీ నాయకులకు చెంప చెల్లుమనిపించడం ఖాయమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభమైన వారం రోజులు గడుస్తున్న నేపథ్యంలో మహిళల స్పందన తెలుసుకునేందుకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. గొరిదిండ్ల గ్రామం నుంచి ఆత్మకూరు వరకు ఆమె మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. ఎమ్మెల్యే సునీత కూడా జీరో ఫేర్ టికెట్ తీసుకున్నారు. అలాగే ఏ పని మీద ప్రయాణం చేస్తున్నారు.. బస్సులో ఉచితంగా రావడం వలన మీకు ఎంత మేర డబ్బు ఆదా అవుతోంది.. ఈ పథకం రావడం వలన మీకు ఉపయోగం ఉందా.. ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. వంటి వాటి గురించి తెలుసుకున్నారు. మహిళల నుంచి ఈ పథకం పై మంచి స్పందన కనిపించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు దృష్ట్యా స్త్రీ శక్తి పథకం అమలవుతుందా లేదా అనే అనుమానం చాలా మందికి ఉండేదన్నారు. కానీ మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. దీనిపై మహిళల్లో కూడా చాలా సంతోషం వ్యక్తమవుతోందన్నారు. ఇప్పటికే 60లక్షల మందికి పైగా మహిళలు ప్రయాణం చేశారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయణం విషయంలో ప్రజల నుంచి కొన్ని విజ్ఞప్తులు వస్తున్నాయన్నారు. కర్ణాటక ప్రాంతానికి వెళ్లే బస్సుల్లో ఏపీ బార్డర్ వరకు ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించాలన్నారు. అలా చేయకపోతే చాలా మందికి ఇబ్బంది ఏర్పడే పరిస్థితి ఉందని.. ఇప్పటికే ఈ విషయాన్ని రవాణాశాఖ మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అన్నీ నెరవేరుస్తున్నట్టు చెప్పారు. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఇప్పుడు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటివి వరుసగా అమలు చేస్తున్నామన్నారు. గతంలో జగన్ రెడ్డి పార్టీలు చూసి పథకాలు ఇచ్చారన్నారు. ఇప్పుడు ప్రజలకు పథకాలు అమలు చేయడం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారన్నారు. ఆయన వద్దకు జనమే కాదు.. ఆపార్టీ లీడర్లు కూడా వెళ్లడం లేదన్నారు. పని లేక ఆ పార్టీ నాయకులను ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం పై దుష్ప్రచారం చేయిస్తున్నారన్నారు. ఇప్పుడు ప్రజల వద్దకు వెళ్లి పథకాలు అందించడం లేదంటే వారు చెంప చెల్లుమనిపిస్తారని ఎమ్మెల్యే సునీత అన్నారు

# శృతి మించిన కూటమి ఎమ్మెల్యేల అరాచకాలు..

**అయినా ఏ ఒక్కరి పైనా నమోదు కాని కేసులు..**
**:మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆక్షేపణ.**
**వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి సాకే శైలజానాథ్.**
**ఆ ఎమ్మెల్యేలను కాపాడుతున్న సీఎం చంద్రబాబు..**
**దీంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి..**
**మహిళలు, ఉద్యోగులు, ప్రతిపక్ష నాయకులపై దాడులు..**
**:సీఎం తీరుపై సాకే శైలజానాథ్ ఫైర్**




**తాడేపల్లి ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్**
టీడీపీ కూటమి ఏడాది పాలనలోనే ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకుల అరాచకాలు శృతి మించి పోయాయని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆక్షేపించారు. గతి తప్పి వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేలను సీఎం చంద్రబాబు కాపాడుతున్నారన్న ఆయన, దీని వల్ల రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు పాలనపై పట్టు పూర్తిగా కోల్పోయారని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన సాకే శైలజానాథ్ తెలిపారు.

**ప్రెస్‌మీట్‌లో సాకే శైలజానాథ్ ఇంకా ఏం మాట్లాడారంటే..:**

**సుపరిపాలన అర్థాన్నే మార్చారు:**
సీఎం చంద్రబాబు తన 14 నెలల పాలనలో విపక్షంపై దాడులు, యథేచ్ఛగా దోపిడి, అంతులేని అవినీతి వంటి వాటితో సుపరిపాలనకు అర్థాన్నే మార్చేశారు. అసలు సుపరిపాలన అంటే దాడులు, దోపిడీలు, అత్యాచారాలా?. ఎందుకంటే ఇప్పుడు రాష్ట్రంలో అవే కళ్లకు కనిపిస్తున్నాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన ఎక్కడా జరగడం లేదు. విచ్చలవిడితనం పెరిగిపోయింది. వ్యవస్థలను ప్రణాళికా బద్ధంగా నాశనం చేస్తున్నారు. రెడ్ బుక్ పేరుతో దౌర్జన్యాలు చేస్తున్నారు. చంద్రబాబు ప్రచారం చేసుకునే సుపరిపాలన అంటే దళితుల మీద దాడులు, మహిళల మీద అత్యాచారాలు, ఉద్యోగులకు వేధింపులే కావొచ్చు. ఇసుక, మట్టి, మద్యం, మైనింగ్‌లో విచ్చలవిడి దోపిడీని కూడా సుపరిపాలన అని చెప్పుకుంటున్నారు. ఫొటోలు, వీడియోలతో ప్రచార ఆర్భాటాలు తప్పించి సగటు పేదవాడికి ఎక్కడా మేలు చేసిన దాఖలాలు కనుచూపు మేరలో చూద్దామన్నా కనిపించడం లేదు.

**నిస్సిగ్గుగా సొంత ప్రచారం:**
నిజానికి తన ప్రమేయం లేకుండా జరిగిన వాటిని కూడా సీఎం చంద్రబాబు నిస్సిగ్గుగా తన ఖాతాలో వేసుకుంటున్నారు. స్వర్ణ చతుర్భుజి పేరుతో ఆనాడు ప్రధాని వాజ్‌పేయి దేశంలోని నాలుగు మెట్రో నగరాలు కలుపుతూ నిర్మించిన జాతీయ రహదారి కూడా తన సలహాయే అని ఏ మాత్రం సిగ్గు లేకుండా చంద్రబాబు చెప్పుకుంటున్నారు. పబ్లిసిటీ పిచ్చి ఇలాగే తలకెక్కితే కృష్ణా నదికి వరదలు కూడా తానే తెచ్చానని చెప్పుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదేమో!. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో సా. 6 గం. తర్వాత పెరిగిన 12.5 శాతం (48 లక్షల) ఓట్లపై చంద్రబాబుకు కూడా ఎక్కడో అనుమానం ఉండి ఉంటుంది. అందుకే దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలని భావించి పాలన గాలికొదిలేశాడు. విచ్చలవిడి దోపిడీకి తెర ఎత్తాడు.

**రెచ్చిపోతున్న కూటమి ఎమ్మెల్యేలు:**
గతంలో ఏనాడూ రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తలేదు. కూటమి ప్రభుత్వం కొలువు దీరాక పదేళ్ల క్రితం పెట్టిన సోషల్ మీడియా పోస్టులపై కూడా వైయస్సార్సీపీ కార్యకర్తలను అరెస్టు చేసి వేధిస్తున్నారు. బెయిల్ రాకుండా పీటీ వారెంట్లతో రాష్ట్రమంతా జైళ్లకి తిప్పారు. టీడీపీ శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అటవీ శాఖ అధికారులను బంధించి, దారుణంగా తిట్టి, హింసించి వేధించాడు. ఆ ఎమ్మెల్యే మీద కేసు పెట్టడానికి శాంతి భద్రతల విభాగాన్ని పర్యవేక్షించే చంద్రబాబు ఎందుకు వెనుకాడుతున్నారు? అంటే, చంద్రబాబు ప్రోత్సాహంతోనే ఇలాంటి అరాచకాలు జరుగుతున్నాయని అర్థం చేసుకోవాలా?
టీడీపీకే చెందిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, జూనియర్ ఎన్టీఆర్ తల్లిని దారుణంగా తిట్టి అవమానపరిస్తే ఇంతవరకు ఆయన మీద చర్యల్లేవు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్‌ను వీడియో కాల్స్ చేసి మానసికంగా వేధిస్తే ఆయన మీదా చర్యల్లేవు. మహిళలను వేధిస్తే అదే వారికి ఆఖరి రోజు అవుతుందని చెప్పే చంద్రబాబు, ఈ హెచ్చరికలు టీడీపీ వారికి వర్తించవని చెప్పాలనుకుంటున్నారా? మంత్రి అచ్చెన్నాయుడి అవినీతికి సహకరించ లేదని ఏపీ ఆగ్రోస్ జీఎంను బదిలీ చేసి, ఆ స్థానంలో అర్హత లేని చిన్న స్థాయి ఉద్యోగిని తెచ్చిపెట్టుకున్నారు. దెందులూరులో గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని తన పొలంలోకి కూడా పోనీయకుండా రౌడీలను మోహరించి వేధిస్తున్నాడు. కళ్యాణదుర్గంలో టీడీపీ నాయకుల వేధింపులు భరించలేక గర్భిణి ఆత్మహత్య చేసుకుంది. గుంటూరులో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వేధింపులతో ఒక మహిళ ఆత్మహత్యా యత్నం చేసింది. ఇప్పటికీ అనంతపురం జిల్లాలోని ఏడుగుర్రాలపల్లె గ్రామంలో అత్యాచారానికి గురైన బాలికకు న్యాయం జరగలేదు. వైయస్సార్‌సీపీ సర్పంచ్ జెండా ఎగురవేయడానికి కూడా రాకుండా టీడీపీ గూండాలు అడ్డుకున్నారు. యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఖైదీకి టీడీపీ ఎమ్మెల్యేల సిఫార్సులతో హోంశాఖ పెరోల్ మంజూరు చేస్తే దాన్ని వైయస్సార్సీపీకి ఆపాదించడం కన్నా దుర్మార్గం వేరొకటి ఉంటుందా?

**నిందితులకు ఈ ప్రభుత్వం రక్షణగా నిలుస్తోంది:**
నర్సారావుపేటలో ఎమ్మెల్యే ఇంట్లోనే సొంత పార్టీ కార్యకర్తపై దాడి చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే స్క్రాప్ వ్యాపారిని కోటి రూపాయల కమీషన్ కోసం వేధించి కొట్టి ఫోన్ లాక్కున్నాడు. కాకినాడ రూరల్‌లో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మీద జనసేన ఎమ్మెల్యే దాడి చేశాడు. కర్నూలులో వాల్మీకి సామాజికవర్గానికి చెందిన యువకులను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కొట్టి కాళ్లు మొక్కించుకున్నాడు. యర్రంశెట్టి నాని అనే జనసేన కార్యకర్తని కొట్టి టీడీపీ నాయకులు కాళు మొక్కించుకున్నారు. వైయస్సార్సీపీ సోషల్ మీడియా వారియర్ ఇంటూరి రవికిరణ్ కి బెయిల్ ఇచ్చేందుకు వచ్చిన మాజీ మంత్రి పేర్ని నాని మీద టీడీపీ, జనసేన సైకోలు దాడి చేశారు. డ్వాక్రా మహిళలను కూడా వదిలిపెట్టకుండా టీడీపీ నాయకులు చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఇలాంటివి ప్రజాస్వామ్య వ్యవస్థకు పూర్తి విరుద్ధం.

**విచ్చలవిడిగా భూదోపిడి:**
విచ్చలవిడి దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా చంద్రబాబు పాలన మారిపోయింది. రాష్ట్రంలో వేల కోట్ల విలువైన భూములను సాఫ్ట్‌వేర్ కంపెనీల ముసుగులో ఉర్సా వంటి సూట్‌కేస్ కంపెనీలకు ఎకరాలకు ఎకరాలు కేవలం 99 పైసలకే కట్టబెట్టేస్తున్నారు. ఏ అర్హత లేకున్నా విశాఖలో విలువైన 13.5 ఎకరాల భూములను, విజయవాడలో ఆర్టీసీ భూములను లులూకు ఇస్తున్నారు. కర్నూలులో 1500 ఎకరాలు అప్పనంగా కట్టబెట్టేశారు. పేద విద్యార్థుల కోసం వైయస్ జగన్ నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసే క్రమంలో మూసేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం వేగంగా అడుగులు వేస్తున్నా చంద్రబాబు నోరెత్తడం లేదు. ఇలాంటి అక్రమాలపై ఎవరూ తనని ప్రశ్నించకుండా అక్రమ కేసులతో ప్రతిపక్షం గొంతు నొక్కుతున్నాడు. చివరకు పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలను పూర్తిగా కట్టడి చేసి, వారిని ఓటు వేయనీయలేదు. మరోవైపు అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే కాకుండా, అత్యంత అమానవీయంగా దివ్యాంగుల పింఛన్లు తీసేస్తున్నారని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆక్షేపించారు.

## సంపాదకీయం

# ఏఐ..సమస్యనా? పరిష్కారమా?

'చాట్ జీపీటీలో అడిగే ప్రతి ప్రశ్నకు ఒక చుక్క నీరు ఖర్చవుతుంది'.. ఇటీవల ఒక సమావేశంలో ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్ మాన్ చెప్పిన మాటలివి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజు చాట్ జీపీటీకి 2.5 బిలియన్లు.. అంటే 250 కోట్ల క్వరీస్ వస్తాయి. ఈ లెక్కన తీసు కున్నా.. ప్రతి రోజు లక్షల లీటర్ల నీరు ఒక్క చాట్ జీపీటీ వంటి ఏఐకు అవసరం. అయితే ఇది సామ్ ఆల్ట్ మాన్ చెప్పిన అతి తక్కువ లెక్క మాత్రమే. దీనికి పది రెట్లు ఎక్కువ నీరు ఖర్చవుతుందని ఒక అంచనా. ఈ ప్రకారం చూసుకున్నా.. ఏఐ వల్ల మనుషుల ఉద్యోగం, ఉపాధి మీద ప్రభావం పడడమే కాదు.. భూమిపై పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతున్నది. గ్లోబల్ వార్మింగ్ కు ఇది కారణమవుతున్నది. అయితే ఏఐ వల్ల నష్టాలను పక్కనపెడితే.. శాస్త్ర, సాంకేతిక, వైద్య, విద్య, వాతావరణ మార్పుల అంచనా, ఖగోళ పరిశోధన రంగాలు ఏఐ వల్ల దూసుకుపోతున్నాయి. క్యాన్సర్ వంటి రోగాలు పూర్తిస్థాయిలో నయమయ్యేలా సమీప భవిష్యత్తులో వ్యాక్సిన్, మందులు ఏఐ వల్ల సాధ్యమయ్యే అవకాశాలున్నాయి. విద్యారంగంలోనూ సమూల మార్పులు చోటుచేసుకో నున్నాయి. ఈ నేపథ్యంలో అనేకసమస్యలకు, రోగాలకు పరిష్కారమార్గాలు చూపుతున్న ఏఐ.. తన వల్ల ఏర్పడుతున్న పర్యావరణ సమస్యకు కూడా పరిష్కారం వెతికే ప్రయత్నం చేయాలి. ఆయా కంపెనీలు ముందుగా అటువైపు దృష్టిసారించాలి. ఏఐ వెనక ఊహించని విధ్వంసం జరుగుతున్నదని అనేక మంది పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా చాట్ జీపీటీ (ఓపెన్ ఏఐ), గ్రోక్ (ఎక్స్), జెమినీ (గూగుల్), డీప్ సీక్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), మెటా, ఎన్‌విడియా, ఇంటెల్, సిస్కో, ఎక్స్ వంటి కంపెనీలు ఏఐని అభివఅద్ధి చేస్తూ వినియోగంలోకి తీసుకువస్తున్నాయి. ఇంకా అనేక కంపెనీలు ఈ రంగంలో తమ సత్తా చాటుకునేందుకు ప్రయత్ని స్తున్నాయి. అయితే ఏఐ కోసం ఇలాంటి కంపెనీలకు డేటా సెంటర్లు అత్యంత ప్రాముఖ్యం కలిగి ఉంటాయి. ఏఐ విస్తృత వినియోగం వల్ల ఈ డేటా సెంటర్లలో ఉండే సర్వర్లు, సూపర్ కంప్యూటర్లు నిరంతరం వేడెక్కుతాయి. వీటిని చల్లబర్చ డానికి ప్రతి రోజు కోట్లలీటర్ల నీరు అవసరమవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు ప్రస్తుతం 560 బిలియన్ లీటర్ల నీటిని వినియో గిస్తున్నాయి. సమీప భవిష్యత్తులో ఇది 1200 బిలియన్ లీటర్లకు పెరగవచ్చు. ఒక సాధారణ డేటా సెంటర్ రోజుకు 5 మిలియన్ గ్యాలన్ల నీటిని వాడుతుంది. ఇది 10వేల నుండి 50వేల మంది నివసించే ఒక పట్టణ ప్రజల నీటి వినియోగానికి సమానం. 2027 నాటికి ఏఐ కోసం 6.6 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు అవసరమవుతుందని అంచనా. గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా కంపెనీలు 2022లోనే 580 బిలియన్ గ్యాలన్ల నీటిని వాడాయి. ఈ నేపథ్యంలో ఏఐ కంపెనీలు వినియోగించే డేటా సెంటర్లు ఉన్న అమెరికా, ఐరోపా, సింగపూర్, సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాల్లో నీటి కొరత ఏర్పడుతున్నట్లు తెలుస్తున్నది. ఏఐకి నీటి కేటాయింపులు చేస్తుండడంతో స్థానిక ప్రజల తాగునీరు, వ్యవసాయ అవసరాలకు కేటాయింపులు తగ్గుతున్నా యనే విమర్శలు వస్తున్నాయి. ఓపెన్ ఏఐ లాంటి సంస్థలు లాంగ్ ఏఐ మోడల్స్ శిక్షణ కోసం వేలకొద్దీ గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో విపరీత మైన విద్యుత్ ఖర్చవుతుంది. 2023లో యూఎస్ లోని డేటా సెంటర్లు ఆ దేశ వినియోగంలో ఉన్న విద్యుత్ లో 4.4శాతం కరెంట్ ను వాడాయి. 2028 నాటికి ఇది పన్నెండు శాతానికి పెరిగే అవకాశముంది. అయితే ఆ విద్యుత్ ఉత్పత్తి కోసం వినియోగించే బొగ్గు, ఇతర శిలాజ ఇంధనాల వల్ల వందల టన్నుల కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయి. ఏఐ కోసం వినియోగించే చిప్ ల వల్ల కూడా పర్యావరణానికి హాని ఏర్పడుతున్నది. చిప్‌ల తయారీ కోసం వేల గ్యాలన్ల శుద్ధి చేసిన నీరు అవసరం. అంతేకాకుండా సిలికాన్, బంగారం, ప్లాటినం వంటి ఖనిజాలను భూమి నుంచి వెలికి తీయడానికి భారీగా మైనింగ్ చేయాల్సి ఉంటుంది. దీనికోసం అడవులను నిర్మూ లిస్తున్నారు. భూమి సైతం కోతకు గురవుతున్నది. అంతేకాకుండా పాడైపోయాక ఆ చిప్‌లను పారేస్తుండడం వల్ల పర్యావరణానికి మరింత నష్టం జరుగుతున్నది. అనేక రంగాల్లోని క్లిష్టమైన సమస్యలకు పరిష్కార మార్గాలు వెతుకుతున్న ఏఐ.. ముందుగా తన వల్ల జరిగే పర్యావరణ హననానికి పరిష్కారాన్ని వెతకాలి. సౌర, పవన శక్తి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. తక్కువ శక్తిని వినియోగించే ఏఐ అల్గారిథమ్స్‌ను రూపొందించు కోవాలి. తమ కంపెనీల వల్ల కలిగే పర్యావరణ ప్రభావాన్ని ముందుగా ఈ కంపెనీలు ప్రజలకు వివరించాలి. ప్రజలు కూడా ఏఐ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. అనవసర ప్రశ్నలకు, ఏఐలో హాలో, హారు, ధన్యవాదాలు వంటి పదాలకు దూరంగా ఉండాలి. ఏఐ వల్ల అనేక సమస్యలకు పరిష్కారాలు దొరుకుతున్నాయనుకొని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. ప్రపంచం ముందు పర్యావరణానికి సంబంధించి మరో పెద్ద సమస్య ఏర్పడే ప్రమాదముంది.

# ఒకే దేశం ఒకే ఎన్నిక పై లోక్ సభ స్పీకర్ కు నివేదిక ఇచ్చిన బిసాతి భరత్





**డిల్లీ ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్** అనంతపురం జిల్లా కు చెందిన యువకుడు జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాతి భరత్ న్యూఢిల్లీలోని భారత పార్లమెంట్ భవనంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ను కలిశారు.ఈ సమావేశం లో ఒకే దేశం ఒకే ఎన్నిక అనే ఎన్నికల సంస్కరణ పై చర్చించారు. సంవిధాన్ సపోర్ట్ గ్రూప్‌లో భరత్ కీలక సభ్యుడిగా ఉంటూ దేశవ్యాప్తంగా యువ ప్రతిభావంతులచే ఏర్పాటు చేయబడింది దీని ద్వారా భారత ఎన్నికల వ్యవస్థలోఎన్నికల సంస్కరణలను ప్రోత్సహించడమే దీని యొక్క ప్రధాన లక్ష్యం.ఈ బృందంలో జాతీయ యువజన అవార్డు గ్రహీతలు, ఎన్ఎస్ఎస్ అవార్డు గ్రహీతలు అవార్డు గ్రహీతలు అయిన శివ కుమార్, మధిష్ పరీఖ్, సిమర్‌దీప్ సియాల్, రోహిత్, పల్లబ్ బిస్వాస్, నిహారిక, శ్రుస్తి మరియు మంటు కుమార్ పాల్గొని. లోక్‌సభ స్పీకర్‌కు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు, ఇందులో బాగంగా దేశ వ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ అభిప్రాయాన్ని దేశ యువత తరపున ఉద్ఘాటించారు. సంవిధాన్ సపోర్ట్ గ్రూప్ ద్వారా 320 మందికి పైగా పార్లమెంట్ సభ్యులతో సమావేశమై వారి యొక్క అభిప్రాయాలను తెలుసుకొని, దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత నుంచి సంతకాల సేకరణ చేపట్టి 2000 మందికి పైగా యువతీ యువకులు పాల్గొని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష, చేసి పార్లమెంట్ వరకు శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు అలాగే జాతీయ అవార్డు గ్రహీతలుగా 112 మంది సంతకాలతో కూడిన



వినతిపత్రాలు కూడా సమర్పించారు.ఈ సమావేశంలో బిసాతి భరత్ వన్ నేషన్ వన్ ఎలెక్షన్ ద్వారా పాలనా స్థిరత, ఎన్నికల ఖర్చుల నియంత్రణ, నల్లధనం, మత్తుపదార్థాల దుర్వినియోగం తగ్గింపు, ప్రజలలో ఓటింగ్ అలసట తగ్గించవచ్చని వివరించారు. దీని వల్ల పరిపాలనా సామర్థ్యం మెరుగుపడి, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దీనిపై లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా యువత చూపిన నిబద్ధతను అభినందించి, దేశ రాజ్యాంగ విలువల పరిరక్షణలో వారి పాత్రను ప్రశంసించారు

## మాజీ సైనికులు, వీర నారీల పెన్షన్, కుటుంబ సభ్యుల పేర్ల సవరణకు సంబంధిత రెజిమెంట్ ఆర్మీ రికార్డు ఆఫీసుల ద్వారా చర్యలు

### మద్రాస్ రెజిమెంట్ రికార్డ్ ఆఫీసు అవుట్రీచ్ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప







**అనంతపురము, ఆగస్ట్ 21: బహుజన వేదిక న్యూస్** ఉమ్మడి అనంతపురము జిల్లాలో ఉన్న మాజీ సైనికులు, వీర నారీల పెన్షన్, కుటుంబ సభ్యుల పేర్ల సవరణ పార్ట్ 2 ఆర్డర్ అంశాలపై సంబంధిత రెజిమెంట్ ఆర్మీ రికార్డు ఆఫీసుల ద్వారా వేగవంతమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప తెలిపారు. ఈ మేరకు మద్రాస్ రెజిమెంట్ లో పని చేసి రిటైర్ అయిన మాజీ సైనికులు, యుద్ధవీరుల వీర నారీల సమస్యల పరిష్కారం కోసం మద్రాస్ రెజిమెంట్ (వెల్లింగ్టన్) ఆర్మీ రికార్డ్ ఆఫీసు అధికారులు గురువారం నాడు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో నిర్వహించిన అవుట్రీచ్ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప మాట్లాడుతూ మాజీ సైనికులు, వీర నారీల సమస్యలపై తాము జిల్లా సైనిక్ బోర్డు నుంచి ఆర్మీ రికార్డ్ ఆఫీసులకు పంపుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఇంకా వేగవంతంగా చర్యలు చేపట్టాలని ఆర్మీ అధికారులను కోరారు. ఈ అంశంపై మద్రాస్ రెజిమెంట్ రికార్డ్ ఆఫీసు ఆర్మీ అధికారులు మంచి చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరిస్తున్నారని, గత సంవత్సరం మాదిరి ఈ సంవత్సరం కూడా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో అవగాహన మరియు పరిష్కార సమావేశం నిర్వహించడం పట్ల జిల్లా సైనిక సంక్షేమ అధికారి అభినందించారు. నార్పల కు చెందిన గాండ్ల లీలావతి భర్త వరికుంట్ల వెంకట సుబ్బయ్య గత డిసెంబర్ లో జమ్ము కాశ్మీర్ లోని మన దేశ సరిహద్దుల్లో సైనిక విధులు నిర్వహిస్తూ అమరులయ్యారని, సదరు అమర జవాన్ కు సంబంధించి మద్రాస్ రెజిమెంట్ మరియు ఆర్. ఆర్. రెజిమెంట్ల నుండి క్యాజువాలిటీ క్లాసిఫికేషన్ రికార్డ్ లు ఇంకా జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయానికి పంపలేదని, ఈ అంశంపై ఇదివరకే మూడు లేఖలు వ్రాశామని, త్వరగా పంపాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప మరియు వీర జవాన్ వరికుంట్ల వెంకట సుబ్బయ్య భార్య వీర నారి గాండ్ల లీలావతి మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ రికార్డ్ ఆఫీసు అధికారులకు విజ్ఞప్తి చేయగా, సదరు అమర జవాన్ రికార్డులను ఆర్మీ హెడ్ క్వార్టర్స్ కు పంపామని త్వరలో వస్తాయని మద్రాస్ రెజిమెంట్ రికార్డు అఫీసు నుండి వచ్చిన సుబేదార్ దొడ్ల రమేష్ , హవల్దార్ క్లర్క్ అనీష్ లు వివరించారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ లో దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన గోరంట్ల కల్లి తండా అగ్నివీర్ మూడ్ మురళి నాయక్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున యాభై లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని, 5 ఎకరాల భూమి, 300 గజాల ఇంటి స్థలాన్ని మురళి నాయక్ తల్లితండ్రులకు ఇటీవల బిసి సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ అందజేశారని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం నిధులు దాదాపు 14 లక్షలతో మురళి నాయక్ సమాధిని నిర్మించారని, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మంజూరు చేసిన రూ. 16 లక్షలతో మురళి నాయక్ సమాధి వరకు సిసి రోడ్డును కూడా నిర్మించారని తిమ్మప్ప తెలిపారు. అలాగే, మాజీ సైనికుల భూముల సమస్యల పరిష్కారం కోసం అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్.చేతన్ లు చాలా సానుకూలంగా స్పందించి ఎప్పటికపుడు సమస్యలను పరిష్కరిస్తున్నారని, పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో స్పర్శ్ ఉచిత కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేశామని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప కోరారు. అదేవిధంగా నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారు మాజీ సైనికులు, వీర నారీల కోసం ఇటీవల నూతనంగా ప్రారంభించిన వీర నారీ పరివార్ సహాయతా యోజన పథకం కింద స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు అనంతపురము జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురము జిల్లా మాజీ సైనికులు, వీర్ నారీలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు లీగల్ సర్వీసెస్ క్లినిక్ ను జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో ఆగస్టు 15 న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీ ఈ. భీమరావు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ మరియు సివిల్ జడ్జి శ్రీ ఎన్. రాజశేఖర్ లు ప్రారంభించారని, ప్రతి వర్కింగ్ శనివారం ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లీగల్ సర్వీసెస్ క్లినిక్ ద్వారా ఉచిత న్యాయ సేవలను అడ్వకేట్ శశికళ, పేరా లీగల్ శంకర్ ద్వారా అందిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప కోరారు. అనంతరం, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, సిబ్బంది గిరీష్, బాబా ఫక్రుద్దీన్, అమర్ నాథ్ లాల్, మద్రాస్ రెజిమెంట్ రికార్డ్ ఆఫీసు నుండి వచ్చిన ఆర్మీ అధికారులు సుబేదార్ దొడ్ల రమేష్, హవల్దార్ క్లర్క్ అనీష్, హవల్దార్ ప్రతాప్ రెడ్డి లు మద్రాస్ రెజిమెంట్ కు సంబంధించి వచ్చిన 13 మంది మాజీ సైనికులు, 7 మంది వీర నారీలకు సంబంధించిన అర్జీలను తీసుకుని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలను పరిష్కరించడం పట్ల మాజీ సైనికులు, వీర నారీలు హర్షం వ్యక్తంచేశారు

## తప్పులు లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ శాతం పెంచే చర్యలు నిర్వర్తించాలి

బి ఎల్ ఓ లను గుర్తించండి.

జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్






**పుట్టపర్తి, ఆగస్టు,21 : బహుజన వేదిక న్యూస్** ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడం లో భగంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు ఎన్నికల అధికారుల తో కలిసి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ తొలుత గారు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నందు ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడం గురించి అన్ని రాజకీయ పార్టీల నుండి అభ్యంతరాలు మరియు సూచనలు తెలుపవలసినదిగా కోరారు. జిల్లాలో బూత్ స్థాయి ఏజెంట్ల ను గుర్తించాలని అన్నారు. ఓటరు జాబితాలో తప్పులు గుర్తించి ఉంటే సదరు జాబితాను రాబోవు సమావేశానికి తీసుకు రావాలని అన్నారు.ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అవసరమైన సూచనలు, సలహాలు తీసుకుంటుందన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలోనే కాకుండా ముందుగానే ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, మార్పులు, చేర్పులు, తొలగింపు, ఓటర్ల సంఖ్య అనుగుణంగా నూతన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ వంటి అంశాలపై చర్యలకు భారత ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు.ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రతినిధులు తప్పులు లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, 18-19 వయసుగల యువత ఓటు నమోదు వంటి అంశాలపై తమ సూచనలు, సలహాలు అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు, రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి వాటి జాబితాలను వెంటనే సంబంధిత నియోజకవర్గ ఎన్నికల అధికారికి సమర్పించవలసినదిగా ఆదేశించియున్నారు.ఈ సమావేశంలో ఇంచార్జి డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ ఎమ్మార్వో జాకీర్ హుస్సేన్, టిడిపి పార్టీ ప్రతినిధులు ఎస్. ఆదినారాయణ, బిజెపి ఎన్. కళ్యాణ్ కుమార్, బీఎస్పీ ఏ. సుబ్బారాయుడు, కాంగ్రెస్ కె. భరణి, ఆమ్ ఆద్మీ డి. నాగరాజు, సీపీఐ (ఎం), వైఎస్సార్ సిపివెంకట్, రవి నాయక్, జనసేన అబ్దుల్లా ఇతర ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు

## యల్లనూరు మండలం సింగిల్ విండో సోసైటీ చైర్మన్ మరియు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

రైతులకు అన్ని విధాలా అండగా ఉండాలని కోరారు






**యల్లనూరు ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్** శింగనమల నియోజకవర్గం యల్లనూరు మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో సొసైటీ) ఛైర్మన్ గా తరిగోపుల అనిల్ కుమార్ , డైరెక్టర్ లుగా సుబ్బారాయుడు ,రామన్న ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ , హిందూపురం యం.పి. పార్థసారథి ఎడిసీసీ బ్యాంక్ ఛైర్మన్ కేశవరెడ్డి డి.సి.యం.యస్.ఛైర్మన్ వెంకటేశ్వర్లు, కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు,రైతులు,తదితరులు పాల్గొన్నారు. అనంతరం సింగల్ విండో కార్యాలయానికి నూతనంగా ఏర్పాటు చేయనున్న భవనానికి భూమి పూజ నిర్వహించారు.ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ సింగల్ విండో సొసైటీ ఛైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనిల్ కుమార్ కి,డైరెక్టర్లు సుబ్బరాయుడు కి,రామన్న కి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని రైతులకు అండగా నిలిచి, రుణాలను అందించుటలో వివక్ష చూపకుండా అందరికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం లో అందించే అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు రైతులు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలిపారు.కార్యక్రమం అనంతరం రైతులు,ప్రజల నుంచి పలు సమస్యలపై నేరుగా అర్జీలను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్ డేటా అప్లోడ్ ని 25వ తేదీలోపు పూర్తి చేస్తాం




-: జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్




**అనంతపురము, ఆగస్టు 21 : బహుజన వేదిక న్యూస్** ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి ఎంఐ ట్యాంకులు గ్రౌండ్ వాటర్, సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, స్వామిత్వ కార్యక్రమం, స్వచ్ఛ ఆంధ్ర అవార్డులపై సూచనలు, జిల్లా జువెనైల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు అమలు, దిగువ కోర్టులలో ఖాళీగా ఉన్న లా ఆఫీసర్ పోస్టుల భర్తీ, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ మాట్లాడుతూ జిల్లాలో కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్ కి సంబంధించిన డేటా అప్లోడ్ ని 25వ తేదీలోపు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 45 శాఖల నుంచి 300 ఇండికేటర్స్ కి సంబంధించి డేటా పారదర్శకంగా సేకరించి అప్లోడ్ చేస్తామని తెలిపారు. ఆయా శాఖల పరిధిలో సానుకూల ప్రజా దృక్పథంకు సంబంధించి మరింత పురోగతి తీసుకురావాలని సూచించారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిపిఓ అశోక్ కుమార్, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ బాలకొండయ్య, హౌసింగ్ పిడి శైలజ, ఐసిడీఎస్ పిడి నాగమణి, ఎస్పీడీసీఎల్ ఎస్సీ శేషాద్రి శేఖర్, మైన్స్ డిడి ఆదినారాయణ, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి అర్చన, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, సర్వే ఏడి రూప్లనాయక్, డిపిఓ నాగరాజునాయుడు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు

## జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో సమస్యాత్మక గ్రామాలు/కాలనీలలో పోలీసుల పల్లెనిద్రలు

త్వరలో ప్రారంభం కానున్న గణేష్ వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా సోదరబావంతో మెలగండి

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి పల్లెనిద్ర కార్యక్రమాలలో

ఆయా పోలీసుల పిలుపు....గ్రామాల్లోని తాజా సమస్యలపై దృష్టి... పరిష్కారానికి కృషి








**అనంతపురము ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ఆయా సమస్యాత్మక గ్రామాలు/కాలనీలలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో మాట్లాడి తాజా సమస్యలపై ఆరా తీశారు. సమస్యలు తీవ్రం కాకుండా ప్రారంభ దశలోనే పరిష్కారానికి కృషి చేస్తున్నారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా అందరూ కృషి చేయాలి. అల్లర్లు, గొడవలకు దూరంగా ఉంటూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న గణేష్ వేడుకలు ప్రశాంతంగా అందరూ సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని... ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు జోలికెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మత్తు పదార్థాల అనర్థాలు సైబర్ మోసాలు గురించి అవగాహన చేశారు. డిజిటల్ అరెస్టు, లోన్ యాప్ ఫ్రాడ్స్, ఏపికె ఫైల్స్ ఫ్రాడ్స్ , తదితర మోసాలు గురించి వివరించారు. డబ్బు లు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మకూడదని... అపరిచితుల కాల్స్ మరియు లింకులు క్లిక్ చేయరాదని, బ్యాంకు ఖాతాల ఓటిపిలు ఎవరికి చెప్పకూడదని ప్రజలకు సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930 కి కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కలిగించారు

# బీసీల ఆత్మ గౌరవ జీవనమే లక్ష్యం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్** బీసీలు ఆత్మగౌరవంతో జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. దొమ్మర అనే పదానికి గిరి బలిజను కలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేయడంపై ఆ సామాజిక వర్గ ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవితను వారంతా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దొమ్మర అనే కులం పేరుకు గిరి బలజ కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దొమ్మర(గిరి బలిజ)గా పేర్కొంటూ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వెనుకబడిన తరగతుల ఆత్మగౌరవానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బీసీల అభ్యున్నతికి గతంలో ఎన్నడూ లేనివిధంగా నిధులు మంజూరు చేస్తోందని, నూతన పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. త్వరలో ఆదరణ 3.0 పథకాన్ని శ్రీకారం చుడుతున్నామని, ఈ పథకంలో భాగంగా ఆధునిక పరికరాలు అందజేయబోతున్నామని వివరించారు. అంతకుముందు మంత్రి సవితను నవ్యాంధ్ర దొమ్మర కుల సంక్షేమ సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. తమ కులం పేరుతో దూషించడం వల్ల మానసికంగా ఎంతో క్షోభకు గురయ్యే వారమన్నారు. ఇదే విషయమై విషయమై గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే, దొమ్మరికి గిరి బలిజ పేరును కలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ.గోపాల్ హర్షం వ్యక్తంచేశారు. కుల ధ్రువీకరణ పత్రాలను దొమ్మరి(గిరి బలిజ)గా జారీచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొనడంపై ఆయన ఆనందం వెలిబుచ్చారు. ప్రభుత్వ ఆదేశాలతో సమాజంలో తమ బిడ్డలు పడే ఆవేదనకు ఫుల్ స్టాప్ పడిందన్నారు. సీఎం చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటామంటూ, జీవో జారీలో సహకరించినందుకు మంత్రి సవితకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర దొమ్మర కుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు అన్నపురెడ్డి మురళీ, ఎం.శ్రీనివాసరావు, సభ్యులు ఎగ్గిరెడ్డి రాజారత్నం, ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు

## ఉరవకొండ అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలోని వివిధ విద్యాసంస్థలలో సురక్ష వెహికల్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన

జిల్లా ఎస్పీ ఆదేశాలతో విద్యార్థుల్లో చైతన్యం




**ఉరవకొండ ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు... ఉరవకొండ అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలోని వివిధ విద్యాసంస్థలలో సైబర్ నేరాలు- అనర్థాలపై అవగాహన చేపట్టారు. "సురక్ష" డిస్ప్లే బొలేరో వాహనాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఓ ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలకు తీసికెళ్లి నేరాలపై ప్రొజెక్టర్ ద్వారా వీడియోలు చూయిస్తూ విద్యార్థులను అప్రమత్తం చేశారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు( డిజిటల్ అరెస్టు, పార్ట్ టైం జాబ్ ఫ్రాడ్స్, ఫైల్ ఫ్రాడ్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ )... రోడ్డు ప్రమాదాలు నియంత్రణ ( హెల్మెట్ / సీట్ బెల్టు ధరించడం, తదితర రోడ్డు భద్రతా నియమాల పాటింపు) ...గంజాయి, మాదక ద్రవ్యాలు, అనర్థాలపై అవగాహన చేశారు.

## మారాల రిజర్వాయర్ కు కృష్ణా జలాలను విడుదల చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి






**బుక్కపట్నం ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్** నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీళ్లు అందిస్తాం రైతుల కళ్లలో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయం రాయలసీమ ప్రాంతంలో హంద్రీ నీవా ప్రాజెక్టు రూపకర్త మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ హంద్రీనీ వాను పూర్తి చేసి రాయలసీమను సస్యశ్యామలం చేయాలనే ఆలోచనతో ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకొచ్చింది బాబే రాయలసీమ అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు.పుట్టపర్తి నియోజవర్గంలో 193 చెరువులకు ,2 రిజర్వాయర్లు కృష్ణా జలాలతో నింపి ప్రతి ఎకరాకు నీళ్లు అందిస్తాం రైతు కళ్లలో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయం

**మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కామెంట్స్:**

రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మార్చాలని ఉద్దేశంతో ప్రభుత్వం హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొచ్చిందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు.కర్నూలు జిల్లా మల్యాల నుంచి జీడిపల్లి రిజర్వాయర్ కు అక్కడి నుంచి మారాల వరకు 370 కి మీ హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా,తుంగభద్ర నీటీతో పుట్టపర్తి నియోజవర్గంలోని ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. బుక్కపట్నం చెరువు తోపాటు ఆ ప్రాంతంలో 14 చెరువులకు నీళ్లు ఇచ్చి బుక్కపట్నం మండలం మారాల రిజర్వాయర్ కు 0.04 టీఎంసీల సామర్థ్యంతో నీటి నింపుతామన్నారు. కరువు సీముగా ప్రసిద్ధిగాంచిన రాయలసీమ ప్రాంతానికి కృష్ణా జలాల అందించి రాయలసీమ అపర భగీరథుడుగా ముఖ్యమంత్రి చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు

## గణేష్ మండపాల ఏర్పాటుకు విఘ్నాలు కల్పించవద్దు

పోలీసులకు ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపు



**అనంతపురము ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్** నగర ప్రజలు, ముఖ్యంగా యువకులు భక్తిశ్రద్ధలతో వినాయక మండపాలను విరివిగా ఏర్పాటు చేసుకుంటున్నారు మండపాల చుట్టూ శోభాయమానంగా లక్షల రూపాయలు ఖర్చు చేసి అలంకరణలు చేసుకుంటున్నారు ఆది దేవుని ఆశీస్సుల కొరకు ప్రతి వీధిలోను యువకులు వినాయక విగ్రహం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది... వినాయక విగ్రహ అనుమతుల విషయంలో ఎటువంటి ఆటంకాలు కలిగించవద్దని నగర ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఒక ప్రకటనలో పోలీసులను కోరారు... పోలీస్ స్టేషన్ల చుట్టూ భక్తులను తిప్పుకునే సంస్కృతి పోవాలన్నారు.. కొత్తగా ఏర్పాటు చేసే విగ్రహాల ఏర్పాటు విషయంలో కాస్త పట్టువిడుపులు ప్రదర్శించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు... వినాయక విగ్రహ ప్రతిష్ట నుండి గణేష్ శోభాయాన యాత్ర వరకు పోలీసులకు సహకరించాలని ప్రజలను కూడా ఆయన విజ్ఞప్తి చేశారు... ఈ ఏడాది చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ప్రజలు ఇప్పుడిప్పుడే సుఖసంతోషాల బాట పడుతున్నారని, వినాయకుని ఆశీస్సులతో అన్ని విఘ్నాలు తొలగి ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు

# ఉచిత శిక్షణ పొందండి పారిశ్రామిక వేత్తలు గా ఎదగండి

**జిల్లా కలెక్టర్ టి.ఎస్, చేతన్**

**పుట్టపర్తి, ఆగస్టు 21 : బహుజన వేదిక న్యూస్** "ఉచిత శిక్షణ పొందండి -పారిశ్రామిక వేత్తలు గా ఎదగండి" అని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పిలుపునిచ్చారు. గురువారం పుట్టపర్తి మండలం బ్రాహ్మణ పల్లి నందు భారత ప్రభుత్వము గ్రామీణ మంత్రిత్వశాఖ సహకారంతో కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ను.. కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఐ. శ్రీనివాసులు తో కలసి జిల్లా కలెక్టర్ టి.ఎస్, చేతన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. గ్రామీణ యువత తమకు ఇష్టమైన రంగాలలో ఉచితంగా శిక్షణ పొంది పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో శిక్షణా ఇప్పించి .. ప్రతి కుటుంబ లో ఒకరిని పారిశ్రామిక వేత్తగా చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆశయమన్నారు. ఆ మేరకు కెనరా బ్యాంక్ వారి ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ను ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణా కేంద్రంలో ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు భోజన, వసతి సౌకర్యం కూడా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఈ శిక్షణా కేంద్రంలో ఇస్తున్న కోర్సులకు అదనంగా ఈ బైక్ మెకానిజం, డ్రోన్ ఆపరేటింగ్ ..తదితర సాంకేతికతో కూడుకున్న కోర్సులందు శిక్షణా ఇవ్వాలని సంభందిత అధికారులను ఆదేశించారు.ఉద్యోగం అంటే యజమానిపై ఆధారపడాలని, స్వయం ఉపాధి ఉంటె మీరే యజమాని అవుతారని గుర్తుంచుకోవాలన్నారు. మీలో ఉన్న నైపుణ్యాన్నీ పెంపొందించుటకు ఈ శిక్షణ సహాయ పడుతుందన్నారు. శిక్షణా పూర్తి అయిన వారికి బ్యాంకులు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు.. మీకు ఎందులో శిక్షణా పొందాలని ఆసక్తి ఉంటుందో అందులో మీరు శిక్షణా పొంది మీ గ్రామంలో ఉన్న నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వారు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉపయోగపడాలని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల నుండి శిక్షణకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని.. ఏ రంగంలో మీకు నైపుణ్యం కలిగి ఉందో అన్న వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

**శిక్షణా కార్యక్రమాల వివరాలు :**

**పురుషులకు :**



2 వీలర్,మోటార్ సైకిల్ సర్వసింగ్ / రిపేరు, సెల్ ఫోన్ సర్వేసింగ్ మరియు వినియోగము, ఫోటో/వీడియో గ్రఫి, ఎలక్ట్రికల్ హొమ్ వైరింగ్, ప్లంబింగ్ మరియు శానిటరి, ఎలక్ట్రికల్ మోటార్ మరియు పంపుసెట్ రిపేరు, టైలరింగ్ అండ్ డ్రెస్ డిజైనింగ్ (ఫర్ మెన్) సీసీటీవీ కెమెరా ఇన్ స్టాలేషన్ సర్వీసింగ్, కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ (ట్యాలీ)కి ఇంటర్ మరియు డిగ్రీ పాసైనవారు అర్హులు.

**స్త్రీలకు :**

టైలరింగ్ అండ్ డ్రెస్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్, పెళ్లికూతురు మేకప్ , మెహందీ వర్క్, జ్యూట్ బ్యాగ్ తయారీ, కూరగాయల బ్యాగుల తయారీ, వస్త్ర చిత్రకళా ఉద్యమి (జర్దోషి, మగ్గంవర్క్) మరియు ఫ్యాబ్రిక్ పెయింటింగ్, అగరుబత్తిల తయారీ,క్రోవ్వో త్తులు తయారీ,కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ (ట్యాలీ).పచ్చళ్ల, బేకరీ,ఉత్పత్తులు మరియు మసాల పొడర్లు తయారీ.

పై కార్యక్రమాలకు సంబంధించి 12 నుండి 31 రోజుల వరకు శిక్షణా ఇవ్వడం జరుగుతుంది.

**పై వాటిలో శిక్షణా పొందుటకు అర్హతలు :**

అభ్యర్థులు శ్రీ సత్య సాయి జిల్లా, గ్రామీణ ప్రాంతానికి చెందిన వారై ఉండాలి, 19 సంవత్సరం నుండి 45 సంవత్సరాలు లోపు మహిళలు పురుషులు అర్హులు, అభ్యర్థులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలి, అభ్యర్థులు కనీసం 10వ తరగతి పాస్ అయి ఉండవలెను, పై అంశాలలో ఉచితంగా శిక్షణా తో పాటు భోజనం మరియు హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం ఎ.వి. రమణ కుమార్, డైరెక్టర్ ఎన్.శాంతి ప్రియ, పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, నిరుద్యోగులైన మహిళలు పురుషులు తదితరులు పాల్గొన్నారు

# క్యాన్సర్ నివారణపై వైద్యాధికారులకు డివిజన్ స్థాయి శిక్షణా కార్యక్రమం





**అనంతపురము ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్** కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లాలోని అనంతపురం మెడికల్ కళాశాల మరియు ప్రాంతీయ ఆసుపత్రి గుంతకల్ నందు వైద్యాధికారులకు క్యాన్సర్ వ్యాధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది.క్యాన్సర్ స్క్రీనింగ్ పై పూర్తి అవగాహన వచ్చేలా నోరు రొమ్ము మరియుగర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పై హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ద్వారా స్పెషలిస్ట్ డాక్టర్లచే అవగాహన కార్యక్రమం నిర్వహించడమైనది. ఇందులో గైనకాలజీ, ఇఎన్ టి వైద్యులు రాజేష్, సర్జరీ స్పెషలిస్ట్ వైద్యులు అలాగే దంత వైద్యులు సతీష్ శిక్షణ ఇచ్చారు అలాగే మెడికల్ కళాశాల నందు వివిధ రకాలైన క్యాన్సర్లపై పిపిటి ద్వారా ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ గీత సత్యసాయి నోడల్ ఆఫీసర్ యశోద లక్ష్మి, అలాగే పిజి స్టూడెంట్స్ కస్తూరి, జయ గౌరీ మరియు ఇన్ సర్వీస్ పిజి స్టూడెంట్ డాక్టర్ రాజేంద్ర , డిస్టిక్ టి ఓ టి డాక్టర్లు పరమేష్, ప్రవీణ్ రఘునందన్ ఇందిరా ప్రియదర్శిని పి పి టి ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అసంక్రమిత వ్యాధుల నిర్వహణ అధికారి డాక్టర్ నారాయణస్వామి పర్యవేక్షణలో కొనసాగినది. శిక్షణ అనంతరం క్షేత్ర స్థాయి సర్వేలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటికి వెళ్ళి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అనుమానితులను ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆంకాలజీ ఓపినంబర్ 222 విభాగానికి రిఫరల్ సర్వీస్ ద్వారా పంపి తదుపరి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారు నేటి సమాజంలో క్యాన్సర్ వ్యాప్తి ఆందోళనకర రీతిలో ఉందని ప్రాథమికంగా వెల్లడైంది. ఎక్కువమంది వ్యాధి బారినపడినా వివరాలు చెప్పేందుకు చాలామంది ఆసక్తి చూపించట్లేదని గుర్తించారు. ఈసారి ప్రజలందరికీ పూర్తి అవగాహన కల్పించి 18 సంవత్సరములు నిండిన ప్రతి మహిళకు పక్కాగా సర్వేచేసి ప్రారంభ దశలోనే క్యాన్సర్ వ్యాధిగ్రస్థులను గుర్తించే విధంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రణాళికతో ముందుకు వెళ్లనుంది. ఇప్పటికే క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి అనంతపురం సర్వజన వైద్యశాల క్యాన్సర్ విభాగంలో చికిత్స అందించనున్నారు. తదుపరి విడతలో సిబ్బందికి శిక్షణ ఇచ్చి పక్కాగా క్యాన్సర్ బాధితులను గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందించనున్నారు.క్యాన్సర్ బారిన పడిన వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైన చికిత్స అందించేందుకు ఎన్ సి డి 4.0సర్వే ద్వారా వైద్యులు మరియు సిబ్బందిని సిద్ధం చేస్తున్నట్లు డీఎం హెచ్ డాక్టర్ ఈబీదేవి తెలిపారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్ సోనియా మరియు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్ సెకండరీ హెల్త్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ డేవిడ్ , ఎన్ సి డి మరియు ఆర్ బీ ఎస్ కె జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జి నారాయణస్వామి పాల్గొన్నారు

# బుక్కరాయసముద్రం గురుకుల పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభం

**బుక్కరాయసముద్రం (కొర్రపాడు) ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్** బుక్కరాయసముద్రం కొర్రపాడు గురుకుల పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దాతల సహకారంతో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న మీటింగ్ హాల్‌కు డిసిఒ జయలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపల్ సునీత కలిసి భూమి పూజ చేశారు. ఈ హాల్ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు, ఇతర విద్యా కార్యక్రమాలు సౌకర్యవంతంగా నిర్వహించుకోవచ్చని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన డిసిఒ జయలక్ష్మి, విద్యార్థుల భవిష్యత్తు కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాలలో సౌకర్యాలు పెంపొందితే విద్యార్థుల చదువులో ఆసక్తి, క్రమశిక్షణ మరింత పెరుగుతుందని ఆమె అన్నారు. అదేవిధంగా ఎంపీ నిధులతో రూ.5 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించేందుకు కూడా భూమి పూజ జరిగింది. ఈ ప్లాంట్ ద్వారా విద్యార్థులకు శుద్ధి చేసిన





తాగునీరు అందించబడనుంది. శుభ్రమైన నీరు విద్యార్థుల ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో అందరూ గుర్తించాలని డిసిఒ అన్నారు.తరువాత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించిన డిసిఒ, వంటగది, నిల్వ సదుపాయాలను తనిఖీ చేశారు. భోజన పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సునీత మాట్లాడుతూ, దాతల సహకారం, ప్రభుత్వ నిధుల సమకూర్పుతో పాఠశాలలో సదుపాయాలు క్రమంగా మెరుగుపడుతున్నాయని చెప్పారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారులు కలిసి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జై భీమ్ ఉల్లికల్లు చిన్న ఆంజనేయులు, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

## చంద్రబాబు వైఫల్యాలను ఎండగట్టాలి - తలారి రంగయ్య







**కంబదూరు ఆగస్టు 21: బహుజన వేదిక న్యూస్** సీఎం చంద్రబాబు మోసాలను ప్రజాక్షేత్రం లో ఎండగట్టాలని కళ్యాణదుర్గం వైయస్సార్సీపి సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు కంబదూరు మండలంలోని రాళ్ళ అనంతపురం గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించి క్యూ ఆర్ కోడ్ ను అందించారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ తో పాటు అనేక హామీలను కూటమి నాయకులు ఇచ్చారని, వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు సంక్షేమ పథకాల్లో కూడా భారీగా కోత విధించారన్నారు.ఎంతో మంది అర్హులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు అందలేదన్నారు. ఈ కార్యక్రమంలో కంబదూరు మండల కన్వీనర్ కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, ఎంపీపీ భీమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షులు బొమ్మయ్య, టౌన్ కన్వీనర్ వెంకటప్ప ఎంపీటీసీలు సర్పంచులు వైసీపీ నాయకులు కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## పేదలకు భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి

వెల్దుర్తి



వెల్దుర్తి మండల కేంద్రంలో గురువారం నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి చేతులమీదుగా అర్హులైన 16 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆరు లక్షల 79 వేల రూపాయల విలువగల చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ, తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం ధర్మారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, నరసింహారెడ్డి, జగ్గశంకర్ గౌడ్, తలారి మల్లేష్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## 24 న జిన్నారం నూతన కోర్టు ప్రారంభం

పటాన్ చెరు



జిన్నారం మండల ప్రజల చిరకాల కోరిక అయిన కోర్టు ప్రారంభం ఈనెల 24వ తేదీ ఆదివారం నాడు ప్రారంభానికి ముహూర్తం ఖరారు అయినట్లు అధికారులు తెలిపారు,ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్,న్యాయవాదులు, స్థానిక నాయకుల తో కలిసి పర్యవేక్షించారు. మండల ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న న్యాయస్థానం ఏర్పాటు కల నెరవేరుతోందని రవీందర్ గౌడ్ తెలిపారు. కోర్టు అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజలకు న్యాయం పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గుతాయని, చిన్నచిన్న కేసుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల కేంద్రంలోనే న్యాయం లభిస్తుందని ఆయన అన్నారు. కోర్టు ఏర్పాటుతో జిన్నారం మండలానికి మరో గుర్తింపు లభించబోతోందని, న్యాయవాదులకు కూడా విస్తృత స్థాయిలో అవకాశాలు కలుగుతాయని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. కోర్టు ఆవరణలో జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేసి,ఈ నెల 24వ తేదీన జరిగే ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## మెదక్ వరకు త్వరలో రెండు లైన్ల రహదారి వైభవం నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తి

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంనుండి మెదక్ వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి మోక్షం కలుగుతుందని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజి రెడ్డి గురువారం నాడు విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సుపరిచితంగా రెండు సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంలో మెదక్ నుండి వెల్దుర్తి వరకు రెండు వరుసల రహదారి త్వరలో నిర్మాణ పనులు చేపడతామని ఆయన అన్నారు.




# ఏదోటి చేయ్ గుర్రం పాపిరెడ్డి..

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా గుర్రం పాపిరెడ్డి. ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథ తో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. త్వరలో 'గుర్రం పాపిరెడ్డి' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా నుంచి 'ఏదోటి చేయ్ గుర్రం పాపిరెడ్డి..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటకు సురేష్ గంగుల క్యాచీ లిరిక్స్ అందించగా, లక్ష్మి మేఘన, ఎంసీ చేతన్ ఎనర్జిటిక్ గా పాడారు. కృష్ణ సౌరభ్ ఆకట్టుకునే ట్యూన్ తో కంపోజ్ చేశారు. 'ఏదోటి చేయ్ గుర్రం పాపిరెడ్డి, ఏరు దాటివేయ్, ఏదోటి చేయ్ గుర్రం పాపిరెడ్డి, ఓ రూటు వేయ్ గుర్రం పాపిరెడ్డి, ఏక్ మార్ 1234 తుక్కడ, నింగినుంచి ఊడిపడ్డ వాడు ఎవ్వడు ఇక్కడ, మంకీ నుంచి వచ్చిన వాళ్లే కదా అందరు ఇక్కడ, నీరసించి నీరుగారి ఉండిపోకు ఎక్కడ..' అంటూ మంచి బీట్‌తో పాటు ర్యాప్ స్టైల్లో సాగుతుంది ఈ పాట.

# రామ్ కొత్త సినిమా.. రిలీజ్ డేట్ ఎప్పుడంటే?

స్కంద, డబుల్ ఇస్మార్ట్ సినిమాలతో డిజాస్టర్స్ ఎదుర్కొన్న హీరో రామ్.. మాస్ పక్కనబెట్టేశాడు. క్లాస్ సినిమా చేశాడు. అదే 'ఆంధ్ర కింగ్ తాలుకా'. ట్రెండింగ్ బ్యూటీ భాగ్యశ్రీ హీరోయిన్. ఇదివరకే ఓ మెలోడీ పాట రాగా దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలోనే ఇప్పుడు రిలీజ్ తేదీని ప్రకటించారు. ఈ ఏడాది ఇప్పటికే చాలావరకు సినిమాలన్నీ రిలీజ్ డేట్స్ ఫిక్స్ చేసేసుకున్నాయి. వచ్చే రెండు నెలల్లో రవితేజ 'మాస్ జాతర', తేజ సజ్జా 'మిరాయ్', అనుష్క 'ఘాటీ', పవన్ కల్యాణ్ 'ఓజీ', రిషభ్ శెట్టి 'కాంతార' తదితర చిత్రాలు రాబోతున్నాయి. డిసెంబరులో 'రాజాసాబ్' లైనులో ఉంది. దీంతో కొత్త సినిమాలొచ్చినా సరే అన్ సీజన్‌లోనే రావాల్సి ఉంటుంది. ఇప్పుడు రామ్ చిత్రం కూడా నవంబర్ 28న షెడ్యూల్ చేశారు. ఈ మేరకు అధికారికంగా ప్రకటించారు. అయితే 'ఆంధ్ర కింగ్ తాలుకా' సినిమాకు చిన్న ప్రాబ్లమ్ ఉంది. ఇదొచ్చిన వారానికి 'రాజాసాబ్' రిలీజ్ కానుంది. ఒకవేళ ఇది సంక్రాంతికి వాయిదా పడినా, అదే తేదీకి 'అఖండ 2' రావొచ్చని రూమర్స్ వినిపిస్తున్నాయి. ఒకవేళ ఈ రెండింటిలో ఏది రిలీజైనా సరే రామ్ చిత్రానికి కలెక్షన్స్ పరంగా ఇబ్బంది ఉండొచ్చు. 'ఆంధ్ర కింగ్ తాలుకా' చిత్రం హీరోలని అభిమానించే ఫ్యాన్ బయోపిక్ అని చెప్పారు. ఇందులో భాగ్య శ్రీ హీరోయిన్. అయితే ఈ సినిమా చేస్తున్నప్పుడే రామ్-భాగ్యశ్రీ ప్రేమలో పడ్డారని, ప్రస్తుతం డేటింగ్ కూడా చేస్తున్నారని రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి ఇది ఎంతవరకు నిజమో తెలియాల్సి ఉంది.




# ఓటీటీలో కాజోల్ హార్రర్ థ్రిల్లర్ మా డిజిటల్ డెబ్యూ..

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాలెంటెడ్ హీరోయిన్ల జాబితాలో ఫస్ట్ ప్లేస్‌లో ఉంటుంది బాలీవుడ్ భామ కాజోల్ ఈ ఏడాది జూన్‌లో మైథలాజికల్ హార్రర్ థ్రిల్లర్ మా సినిమాతో థియేటర్లలోకి వచ్చింది కాజోల్. అజయ్ దేవ్‌గన్ నిర్మించిన ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ రివ్యూస్ వచ్చాయి. విశాల్ ఫురియా డైరెక్ట్ చేసిన ఈ చిత్రం సైతాన్ యూనివర్స్‌లో వచ్చిన మా ప్రాజెక్ట్ బాక్సాఫీస్ వద్ద రూ.51.64 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. థియాట్రికల్ రన్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఇక ఓటీటీలో తన లక్‌ను పరీక్షించుకునేందుకు ఆగస్టు 22న (నేడు) డిజిటల్ ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్నట్టు ఓటీటీ ప్లాట్‌ఫాం అధికారికంగా ప్రకటించింది. అయితే నెట్‌ఫ్లిక్స్‌లో మా డబ్బింగ్ వెర్షన్లు ఎప్పటినుంచి అందుబాటులోకి వస్తాయనేది తెలియాల్సి ఉంది. మరి నెట్‌ఫ్లిక్స్‌లో హార్రర్ థ్రిల్లర్‌కు ప్రేక్షకులు ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీలో రోనిత్ రాయ్, ఇంద్రనీల్ సేన్ గుప్తా, ఖెరిన్ శర్మ, జితన్ గులాటి, జితేంద్ర కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని దేవ్‌గన్ ఫిలిమ్స్, జియో స్టూడియోస్, పనోరమ స్టూడియోస్ బ్యానర్లపై అజయ్ దేవ్‌గన్, జ్యోతి దేశ్ పాండే, కుమార్ మంగత్ పాఠక్ సంయుక్తంగా తెరకెక్కించారు.

# అందుకే సినిమాలు తగ్గించాను: సమంత



ఇంటర్నెట్‌డెస్క్: నటిగానే కాకుండా నిర్మాతగానూ సరికొత్త కథలను ప్రేక్షకులకు అందిస్తూ అగ్ర కథానాయిక సమంత ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా ఈ బ్యూటీ ప్రముఖ మ్యాగజైన్ 'గ్రాజియా ఇండియా' లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై మెరిసిన విషయం తెలిసిందే. ఆ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఎన్ని సినిమాలు చేశామనేది కాదని.. ఎంత మంచి చిత్రాలు తీశామనేది ముఖ్యమని సమంత చెప్పారు. 15 సంవత్సరాలుగా ఇండస్ట్రీలో తన ప్రత్యేకతను చాటుకుంటోన్న ఆమె ప్రస్తుతం సినిమాలతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. "గతంతో పోలిస్తే ఇప్పుడు నాలో ఎంతో మార్పు వచ్చింది. గొప్ప పనులు చేసే స్థాయికి చేరుకున్నాను. ఫిట్‌నెస్, సినిమాలు రెండిటిపైనా దృష్టిపెట్టాను. మంచి సినిమాలు, సిరీస్‌లలో భాగమయ్యాను. అవన్నీ కేవలం ప్యాషన్ కోసమో, గుర్తింపు కోసమో చేసేవి కావు. అన్నీ నా మనసుకు దగ్గరగా ఉన్న కథలే" "తక్కువ ప్రాజెక్ట్‌లు చేయాలని నిర్ణయించుకున్నా. శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నా. ఇకపై ఒకేసారి ఐదు సినిమాలు చేయను. నా శరీరం చెప్పేది వినాలని తెలుసుకున్నా. అందుకే పనిని తగ్గించుకున్నా. కానీ, తక్కువ చేసినప్పటికీ ప్రేక్షకుల మనసుకు నచ్చే వాటితోనే పలకరిస్తాను. ప్రాజెక్ట్‌ల సంఖ్య తగ్గింది.. కానీ, వాటి నాణ్యత కచ్చితంగా పెరుగుతుంది" అని చెప్పారు. ఇక సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే సమంత అందులో వచ్చే ప్రశంసలతో పాటు విమర్శలను కూడా స్వీకరించగలగాలని తెలిపారు. "నేను సామాజిక మాధ్యమాల్లో సాధ్యమైనంత వరకు వాస్తవంగా ఉండడానికి ప్రయత్నిస్తాను.

# 'కన్యా కుమారి' మంచి సినిమా అవుతుంది



ప్రముఖ నటి మధు శాలిని సమర్పకురాలిగా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. రాడికల్ పిక్చర్స్ బ్యానర్ పై సృజన్ అట్టాడ రచన, దర్శకత్వం, నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ఆగస్టు 27న వి నాయక చవితి సందర్భంగా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ "టీజర్ చాలా బాగుంది. శ్రీచరణ్, గీత్ చక్కగా నటించారు. క్యారెక్టర్స్‌లో ఒదిగిపోయారు. కచ్చితంగా ఇది చాలా మంచి సినిమా అవుతుందని నమ్మకం కలిగింది"అని అన్నారు. మూవీ సమర్పకురాలు మధు శాలిని మాట్లాడుతూ "సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. శ్రీ చరణ్, గీత్ వాళ్ళిద్దరు కూడా అక్కడే పుట్టి పెరిగినట్టు నటించారు. బన్నీ వాసు సపోర్ట్‌తో ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నాము. సృజన్ అద్భుతమైన సినిమాని మన ముందుకు తీసుకొచ్చారు. తప్పకుండా ఈ సినిమాని థియేటర్స్ లో చూసి ఆస్వాదించాలని కోరుకుంటున్నాను"అని తెలిపారు. డైరెక్టర్ సృజన్ మాట్లాడుతూ "సినిమాలో పాత్రలన్నీ కూడా రియల్ లైఫ్ నుంచి వచ్చినవే. ఈ సినిమాలో చాలా మంచి డ్రామా ఉంది"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శశి కుమార్ తిక్క, హీరోయిన్ గీత్ సైని, శ్రీ చరణ్ పాల్గొన్నారు.

Publisher, printer and Owner P. Ramanjaneya Prasad, Government Hospital back SIDE Singanamala (Mandal) Ananthapuram (District)- AP, Printing at LAKSHMI OFFSET Printers, D.NO: 12-3-195, 5th cross SAINAGAR Beside Veterinary Hospital Ananthapuram,
Published at P. Ramanjaneya Prasad Government Hospital Back Side Singanamala (Mandal) Ananthapuram (District)- RNI Reg NO: APTEL/2024/86898 ,AP, Editor P.Ramanjaneya Prasad ph:9494900294